క్లుప్తంగా

ప్రారంభమైన ఉడుపులు



రాజుపేట సమీపంలో ఉడుపుల్లో నిగమ్నమైన మహిళలు

పాలకొండ రూరల్: వరుణిడి కరుణతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కొండలపై నుంచి జాలువారుతున్న నీటిని ఒడిసిపట్టి రైతులు ఉడుపులు చేపడుతున్నారు. ఇటీవల వరుసుగా కురుస్తున్న వర్షాలకు రైతులు యుద్ధ ప్రాతిపదికన యంత్రాల సాయంలో దమ్ములు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం పాలకొండ మండలం రాజుపేట సమీపంలో ముమ్మరంగా ఉడుపులు ప్రారంభించారు. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థిక సాయం అందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూపు కోల్పోతున్న ఓనిగెడ్డ



పూడికలతో ఉన్న ఓని గెడ్డ

పాలకొండ రూరల్: పాలకొండ – వీరఘట్టం ప్రధాన రహదారిలో గజాలాఖానా దిగువ నుంచి ప్రవహిస్తూ మండల పరిధిలోని గోపాలపురం, తదితర ప్రాంతాల రైతుల సాగునీటి అవసరాలు తీరుస్తున్న ఓనిగెడ్డ రూపు కోల్పోతోంది. ఇక్కడి వంతెన దిగువ భాగంలో వ్యర్థాలు,ఖాళీ కొబ్బరి బొండాలు వేసేస్తుండడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. అలాగే గెడ్డపై ఉన్న వంతెన కూడా బలహీనంగా మారింది. అధికారులు స్పందించి కొత్త వంతెన నిర్మించడంతో పాటు గెడ్డను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలి



సమావేశానికి హాజరైన గిరిజన జేఏసీ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9వ తేదీన ఘనంగా నిర్వహించుకోవాలని గిరిజన జేఏసీ నాయకులు కోలక లక్ష్మణమూర్తి, మండంగి రమణ, నిమ్మక శేఖర్, మండంగి శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రంలోని వైటీసీలో ఆదివాసీ దినోత్సవ నిర్వహణపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంఘాల నాయకులు, ఉద్యోగులు, యువత అంతా ఆదివాసీ దినోత్సవ నిర్వహణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు తిరుపతిరావు, సన్యాసిరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరిద్దాం..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- పథకాలను కాపీ కొట్టినా అమలు చేయలేకపోతున్నారు
- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం:

తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టినా సక్రమంగా అమలు చేయలేకపోతోందని ఆరోపించారు. తల్లికి వందనం పథకాన్ని రూపొందించింది విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అని చంద్రబాబునాయుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిన పథకాలు వీరి ఆలోచనల్లోంచి వచ్చాయని చెప్పుకోవడానికి కూటమి ప్రభుత్వానికి సిగ్గు అనిపించడం లేదా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ అంటూ బూటకపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మన పోరాటం ఒక్క కూటమి ప్రభుత్వంతోనే కాదని, ఆ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న ఎల్లో మీడియాను ఎదుర్కోవాలన్నారు. ప్రభుత్వం తీరుపై ఎవరైనా ప్రశ్నిస్తే తప్పుడు కేసులతో వేధిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీకి అండగా ఉండే బలమైన నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని.. ఈ కేవలోనే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఒక్క యూరియా బస్తాకు 3 గంటలు క్యూలో..

కూటమి పాలనలో అన్ని వర్గాలతో పాటు అన్నదాతలు కూడా అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. ఇటీవల వీరఘట్టంలో జరిగిన యూరియా పంపిణీలో ఒక్క బస్తా యూరియా కోసం రైతన్నలు 3 గంటలు క్యూలో ఉండాల్సిన దౌర్భాగ్యం వచ్చిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏనాడూ రైతులు విత్తనాలు, ఎరువుల కోసం రోడ్డెక్కలేదని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఇటీవల పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆ సమయంలో వచ్చిన ప్రజాదరణను చూసి ఓర్వలేకే నేడు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రెడ్‌బుక్ రాజ్యాంగానికి చరమగీతం పాడే రోజులు ముందున్నాయన్నారు.

విద్యార్థులకు పురుగుల అన్నం..



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. సర్కారు బడుల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్తంగా మారిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న గోరుముద్ద పథకం ద్వారా అన్ని సర్కారు బడుల్లో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తే.. నేడు పురుగుల అన్న పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటీవల మాజీ మంత్రి ఆర్కే రోజాపై నగిరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను కళావతి ఖండించారు. మొన్నటికి మొన్న కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను అసభ్యకరంగా దూషిస్తూ కూటమి నాయకులు సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ప్రెసిడెంట్ పిన్నింటి శ్రీనివాసరావు, నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, కర్రి గోవిందరావు, దమలపాటి ఉమమహేశ్వరరావు, నీలం తవిటినాయుడు, శంభాన శ్రీను, నులకజోడు బుజ్జి, కర్రి శంకరరావు, జలుమూరు అమర్‌నాథ్, భోగి మణి, మిడితాన కల్యాణి, బోగి మధన్, దొలూరు శ్రీకాంత్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కూటమి మోసపూరిత పాలనపై నిప్పులు చెరుగుతున్న పాముల పుష్పశ్రీవాణి, పక్కనే వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు



కూటమి మోసాలను ఎండగడదాం

- వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టడమే లక్ష్యంగా పనిచేస్తామని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని చినమేరంగిలో ఉన్న తన క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు నేతృత్వంలో పార్టీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు అధ్యక్షతన ఆదివారం జరిగిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆమె హాజరై, మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదికే ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేయడం జరిగిందని, ఇప్పటి కూటమి సర్కారు మాత్రం గద్దెనెక్కి 13 నెలల కాలం గడిచినా ఒకట్రెండు పథకాలు.. అవి కూడా అరకొరగా అమలు చేశారని విమర్శించారు. కూటమి ఇప్పటివరకు ఇచ్చిన గ్యాస్, తల్లికి వందనం పథకాల్లోనూ ప్రజలకు మోసమే జరిగిందన్నారు. తొలుత ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు అన్నారని..ఇప్పుడు మూడు ఇస్తామంటున్నారని అది కూడా కొంతమందికి డబ్బులు పడడం లేదని మొత్రోమంటున్నారన్నారు. ఇకపోతే ఇటీవల ఇచ్చిన తల్లికి వందనం పథకంలోనూ లబ్ధిదారులకు అన్యాయమే జరిగిందన్నారు. ఇప్పటికీ కొంతమందికి డబ్బులు పడకపోగా డబ్బులు పడిన వారిలో చాలామందికి రూ.13 వేలకు బదులు రూ.10 వేలు మాత్రమే పడిందన్నారు. ఇది కాదా మోసం చేయడం అని నిలదీశారు. మరో వైపు ఎక్కడ పథకాలు ఇవ్వండని ప్రజలు అడుగుతారేమోనన్న భయంతో డైవర్షన్ పాలిటిక్స్ మొదలెట్టేశారని మండిపడ్డారు. ఎక్కడ చూసినా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై దాడులు చేయడం, వారిని అక్రమంగా అరెస్టు చేయడం తప్ప మంచి పాలన చేయడం లేదని ధ్వజమెత్తారు. కూటమి నాయకులు, వారి ప్రభుత్వం చేసే మోసాలను తెలియజేయాలనే వైఎస్సార్ సీపీ అధిష్టానం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి పిలుపునిచ్చిందని, దీనిలో భాగంగా క్యూఆర్ కోడ్ కలిగిన బ్రోచర్లు విడుదల చేస్తున్నామని, ఆ క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్లలో స్కాన్ చేస్తే కూటమి మోసాలు బట్టబయలవుతాయన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులంతా ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.

'రెడ్‌బుక్'కు భయపడొద్దు..

ఇదిలా ఉంటే గతంలో 67 లక్షల మంది లబ్ధిదారులకు ప్రభుత్వ పింఛను అందిస్తే ప్రస్తుత ప్రభుత్వం కేవలం 12 లక్షల మందికి మాత్రమే లబ్ధి చేకూర్చిందని, స్థానిక ఎన్నికల పరిస్థితులను చూసుకుని మరో 10 లక్షల మంది లబ్ధిదారులకు పింఛను ఎగ్గొట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు మాట్లాడుతూ గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేశారన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు మన పార్టీ మరింత అభివృద్ధికి పాటుపడిన ప్రతి కార్యకర్తనూ గుర్తుంచుకుని, పార్టీలో సముచిత స్థానం కల్పించి గౌరవించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మంత్రి లోకేష్ అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఎవరూ భయపడాల్సిన పని లేదని, వారి 13 నెలల దుష్ట పాలనను చూసి ప్రజలే ఛీదరించుకుంటున్నారన్నారు. మళ్లీ రాష్ట్రానికి జగనన్న ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.శశికళ, వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు నారాయణరావు, రైతు విభాగం అధ్యక్షుడు బలగ వెంకటరమణ, వైస్ ఎంపీపీ నిమ్మక గణేష్, ఉషారాణి, రమణమ్మ, విజయకుమార్, కిషోర్, అనంత నాయుడు, భువనమోహనరావు, ఏవీఎస్ కె. వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

కల్వర్టు గోడపై 'ఉపాధి' పనుల బోర్డు



ఈ చిత్రంలో కనిపిస్తోంది..గుమ్మలక్ష్మీపురం మండలం, లక్కగూడ–సదునుగూడ జంక్షన్‌లోని కల్వర్టు రక్షణ గోడపై ఉపాధి పనుల నేమ్‌బోర్డు. ఇది లక్కగూడ రోడ్డు నుంచి సదునుగూడ గ్రామానికి రూ.75 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో వేసిన బీటీ రోడ్డుకు సంబంధించినది. దీన్ని అభివృద్ధి పని జరిగిన ప్రదేశం వద్ద ఖాళీ స్థలంలో ఏర్పాటు చేయాల్సి ఉండగా, తాము ఏం చేసినా చెల్లుతుంది..తమనెవరు అడుగుతారులే అనే రీతిలో ఇలా కల్వర్టు గోడపై నిర్మించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరీ ఇంత అహంకారమా అని మండిపడుతున్నారు. ఇలా కల్వర్టు గోడపైనే నేమ్‌బోర్డు నిర్మించడం వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు.. పొలం పనులకు వెళ్లేవారు కూర్చొని విశ్రాంతి తీసుకునేందుకు స్థలం కరువైందని అంటున్నారు. ఏది ఏమైనా ఇలా చేయడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. –గుమ్మలక్ష్మీపురం

బురదమయంగా లింక్ రోడ్డు



అధ్వానంగా మారిన గోర్జి

భామిని: మండలంలోని నేరడి–బి నుంచి బిల్లుమడ వెళ్లేందుకు పూర్వం నుంచి వినియోగిస్తున్న లింక్ రోడ్డు (గోర్జి) పూర్తిగా బురదమయంగా మారింది. గతంలో వర్షాకాలం ముందు ప్రతి ఏడాదీ ఉపాధి నిధులతో గోర్జిని బాగు చేసి వినియోగించేవారు. ప్రస్తుతం ఎటువంటి అభివృద్ధిపనులు చేపట్టకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోర్జి అధ్వానంగా తయారైంది. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గోర్జిని బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



గణేష్(ఫైల్)

కొమరాడ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జన్ని గణేష్ అలియాస్ గణప్రసాద్(42) శనివారం రాత్రి గుండెపోటుతో చనిపోయారు. రాత్రి భోజనం చేసిన తర్వాత అస్వస్థతకు గురైన ఆయనను 108 అంబులెన్స్ ద్వారా సమాచారం అందించి, పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

అత్యాశకు పోయి సైబర్ వలలో పడొద్దు

- రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి

పార్వతీపురం రూరల్: సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేసి సైబర్ మోసాలకు గురికా వద్దని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి పేర్కొన్నారు. క్యాష్‌బ్యాక్, తక్కువ డబ్బులతో ఎక్కువ రీచార్జ్ ఆఫర్లు అంటూ ఫోన్‌పే పేరిట వస్తున్న లింకులను అత్యాశకు పోయి ఓపెన్ చేసి సైబర్ వలలో పడి మోసపోయి డబ్బులు పోగొట్టుకున్న ఫిర్యాదులు తమకు వచ్చాయన్నారు. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చిన లింకులు, సామాజిక మాధ్యమాల్లో ఆఫర్ల పేరిట పోస్టులు పెడుతున్న లింకులు ఓపెన్ చేసి తమ ఖాతాల్లో ఉన్న డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసేందుకు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అధ్వానంగా రహదారి

- కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ప్రజల అవస్థలు



గోతులమయమైన సన్యాసిరాజుపేట రహదారి

గరుగుబిల్లి: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రజలు నిత్యం కన్నీటి వ్యథను అనుభవిస్తున్నారు. పార్వతీపురం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రహదారి గుండా పెదగుడబ పంచాయతీ సన్యాసిరాజుపేట, ఆర్‌డీ వలస, ముత్యాలదొరవలస, నిడగల్లుగూడ గ్రామ ప్రజలు నిత్యం రాకపోకలు చేసేందుకు ఈ రహదారినే వినియోగిస్తుంటారు. ఈ రహదారి పరిధిలో పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో రాకపోకలు చేసేందుకు వాహనచోదకులు, పాదచారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామానికి వెళ్లే రహదారి పరిధిలో ఉన్న గంగసాగరం చెరువు గట్టుపై రహదారి పూర్తిగా ఛిద్రం కావడంతో రాకపోకలు చేసేందుకు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. అధికారులు, పాలకులకు సమస్యను వివరించి నప్పటికీ చర్యలు లేకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. ప్రస్తుత వర్షాకాలంలో రహదారిపై ప్రయాణం మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల సౌకర్యార్థం రహదారికి మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.

వ్యవసాయ పనుల్లో బెంగాలీ కూలీలు



పొలం వద్ద భోజనాలు చేస్తున్న బెంగాలీ కూలీలు

భామిని: మండలంలో ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. స్థానికంగా వ్యవసాయ కూలీల కొరత ఎక్కువగా ఉండడంతో ఈ సమయంలో పశ్చిమ బెంగాల్ నుంచి వ్యవసాయ కూలీలు వస్తుంటారు. వీరంతా పొలాల సమీపంలోనే వంటలు చేసుకుని పనుల్లో పాల్గొంటారు. వీరి పనితనం బాగుండడంతో ఎక్కువ మంది రైతులు వీరికే పనులు అప్పగిస్తుంటారు. గురండి – బిల్లుమడ గ్రామాల మధ్య వ్యవసాయ పనులు చేపడుతూ బెంగాలీ కూలీలు ఆదివారం దర్శనమిచ్చారు.

పైరుకు శక్తి.. రైతుకు లాభం..

- ఎరువులు పొదుపుగా వాడితే మేలు
- విచ్చలవిడిగా వినియోగిస్తే భూసారానికి ప్రమాదం



పెరుగుతున్న వరి నారు

వీరఘట్టం:

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు వాతావరణం అనుకూలించకపోవడంతో దమ్ములు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఈ పరిస్థితుల్లో నాలుగు రోజుల కిందట తోటపల్లి ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు విడిచిపెట్టడం.. అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో వరినాట్లు వేసేందుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. ఇక వరినారుతో పాటు పైరు దిగుబడికి ఎరువులు వేసేందుకు రైతులు ఉపక్రమిస్తున్నారు. అయితే ఈ సమయంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే నారు పెరగడంతో పాటు దిగుబడి కూడా బాగుంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులు వినియోగించాలని సూచిస్తున్నారు. మట్టి నమూనాల ఆధారంగా నత్రజని, పొటాషియం, భాస్వరం, జింక్ వంటి కాంప్లెక్స్ ఎరువుల వినియోగంతో సమతుల్యతను పాటించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఈ ఏడాది జూలై మొదటి వారంలో ప్రారంభ కావాల్సిన ఉభాలు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. పాలకొండ నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 58,503 ఎకరాల్లో వరి సాగు చేపట్టాలనిని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. పాలకొండ మండలంలో 17,033 ఎకరాల్లో.. వీరఘట్టంలో 18,964.. సీతంపేటలో 8,953.. భామినిలో 13,553 ఎకరాల్లో వరి సాగు చేపట్టనున్నారు. ఈక్రమంలో పంటలకు కావాల్సిన యూరియా కోసం నానా పాట్లు పడుతున్నారు.

ఎరువుల వినియోగం ఇలా..

ఖరీఫ్ మొదటిలో చేపట్టే దమ్ములో ఎకరా పొలంలో యూరియా 20 కిలోలు, భాస్వరం 50 కిలోలు, పొటాష్ 10 కిలోలు వినియోగించి దమ్ము చేపట్టి ఊభాలు పూర్తి చేయాలి. తర్వాత పిలక దశలో 20 కిలోల యూరియా, అంకురం దశలో 25 కిలోల చొప్పున యూరియా, పొటాషలను వినియోగిస్తే పంట దిగుబడి బాగుంటుంది.

నియోజకవర్గంలో వరిసాగు విస్తీర్ణం

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) అంచనా
పాలకొండ	17,033
వీరఘట్టం	18,964
సీతంపేట	8,953
భామిని	13,553
మొత్తం	58,503

నత్రజని వల్ల లాభాలు....

నత్రజని కాంప్లెక్స్ రూపంలో, యూరియా రూపంలో వాడాలి. ఈ ఎరువు పంట ఎదుగుదలకు, పచ్చగా ఉండేందుకు దోహదపడుతుంది. దీనిని మూడు భాగాల్లో వినియోగించాలి. మొదట సారి దమ్ములో, రెండో సారి పిలక దశలో, మూడో సారి అంకురం దశలో వినియోగించాలి.

భాస్వరం..

మొక్కల వేర్లు బలంగా ఉండేందుకు దమ్ము సమయంలో భాస్వరం వినియోగించాలి. లేని పక్షంలో నాట్లు వేసిన వారం రోజుల్లోపు వేయాలి. భాస్వరం అందించే క్రమంలో దమ్ములో మూడు బస్తాల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ రూపంలో 50 కిలోల డీఏపీని వేయాలి.

పొటాష్..

పొటాష్ వల్ల ఆకులు గరుకుతనం కలిగి ఉండడమే కాకుండా గింజ గట్టి పడేందుకు దోహదపడుతుంది. వరికి చీడపీడల బెడద తగ్గుతుంది. పొటాష్‌ను దమ్ము అంకుర దశలో వేయాలి.

జింకు ..

జింకును దమ్ములో ఎకరాకు 20 కిలోల వాడాలి. పంటలో జింకు లోపాన్ని గుర్తిస్తే వంద లీటర్ల నీటిలో 10 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి.

అధికం అనర్థం..



నారు దిగుబడితో పాటు పంట దిగుబడి కోసం అధిక మోతాదులో ఎరువులు వినియోగించడం అనర్థం. విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందులు వాడితే భూసారం దెబ్బతింటుంది. వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చును.

– జె.సౌజన్య, వ్యవసాయశాఖ అధికారి, వీరఘట్టం



వెద పద్ధతిలో సాగులో ఉన్న వరి పంట

రోడ్డుపైనే వర్షపునీరు



ఈ చిత్రంలో కనిపిస్తోంది..కురుపాం మండల కేంద్రంలోని బస్టాండ్ రోడ్డు. ధూళికేశ్వర స్వామి ఆలయం నుంచి బస్టాండ్ వరకు ఇటీవల రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. ఈ క్రమంలో రావాడ రోడ్డు వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించిన కారణంగా ఓ చోట సమతలం లేదు. అదే చోట ఇప్పుడు ఏ చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిల్వ ఉండిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో ఆ దారిలో రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డును సమతలం చేయాలని కోరుతున్నారు.

–గుమ్మలక్ష్మీపురం(కురుపాం)